## తప్పు కప్పిపుచ్చుకునేందుకే

# కేటీఆర్‌పై అక్రమ కేసులు



**నల్లగొండ (నవభూమి)** తమ తప్పులు కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదైన విషయం తెలిసిందే. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేటీఆర్‌తో పాటు సోషల్‌మీడియా ఇంచార్జిలు మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. నకిరేకల్‌లో పదో తరగతి తెలుగు పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ కేసులోని నిందితులతో తమకు సంబంధం లేకున్నా సోషల్‌మీడియా వేదికగా తమపై తప్పుడు ప్రచారం చేశారంటూ నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, మరో వ్యక్తి ఉగ్గిడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులపై నల్లగొండ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చిరుమర్తి లింగయ్య మాట్లాడారు. నకిరేకల్ పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ కేసులో స్థానిక ఎమ్మెల్యే వీరేశం అనుచరులే ఉన్నట్లు తెలిపారు. దాని వెనక వీరేశం హస్తం ఉన్నదని తమ అనుమానం అన్నారు. ఎమ్మెల్యే డ్రైవర్ ఉగ్గిడి శ్రీనివాస్ దీని వెనక అసలు సూత్రదారి అన్నారు. ఎమ్మెల్యే బెదిరింపులతో పోలీసులు అతడిని కేసు నుంచి తప్పించినట్లు చెప్పారు. నిందితులు స్కూల్ యాజమాన్యాలతో భారీ మొత్తంలో ప్యాకేజీ మాట్లాడుకుని రోజు వారిగా పేపర్ లీకేజీ చేసేందుకు కుట్రలు చేసినట్లు తెలిపారు. ఒక అమ్మాయిని బెదిరించి పేపర్ లీక్ చేయాలని ప్రయత్నం చేశారన్నారు. నకిరేకల్‌లో దాడులు, దౌర్జన్యాలు, ఆక్రమణలు వీరేశం మనుషుల నైజం అన్నారు. పేపర్ లీకేజీపై ఒక పేపర్‌లో వచ్చిన క్లిపింగ్‌ను కేటీఆర్ షేర్ చేసినట్లు తెలిపారు. దీని ఆధారంగా ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు.ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తే కేసులా? ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా, కేటీఆర్‌ను చూస్తేనే ప్రభుత్వానికి, కాంగ్రెస్ నాయకులకు లాగులు తడుస్తున్నట్లుగా ఉందన్నారు. పోలీసులను బెదిరుస్తూ అక్రమ కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ కేసు ఎలా పెడతారు. సీఎం మెప్పు కోసం ఎమ్మెల్యే ఇక్కడ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. అజ్ఞాతం నుంచి నుంచి వీరేశం బయటకు వచ్చిందే బీఆర్ఎస్‌తో కదా. బీఆర్ఎస్ లో పనిచేసి వెళ్లిన వేరేశానికి కేటీఆర్‌నే విమర్శించే స్థాయి లేదన్నారు. ఇటీవల ఒక సందర్భంగా సీఎంకు స్వీట్ ఇవ్వబోతే నెట్టేసింది నిజం కాదా అన్నారు. ప్రతీదానికి కేసులు పెట్టడం వీరేశానికి ఫ్యాషన్ గా మారిందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు. పోలీస్ అధికారులు కూడా అక్రమ కేసులపై ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ నేతల దాడులను, దౌర్జన్యలను తిప్పికొట్టె రోజులు దగ్గరలోనే ఉన్నట్లు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ భయపడబోదు, అక్రమ కేసులు ఎదుర్కొంటూ ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

## ఫీజు రీఇంబర్స్మెంట్

# విడుదల చేయాలి






## జర్నలిస్టుల సంక్షేమమే

# జెండా అజెండా



**చండూరు, మార్చి 26 :** జర్నలిస్టుల సంక్షేమమే తమ జెండా అజెండా అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసే జర్నలిస్టులు నిత్యం ఒత్తిడి, సవాళ్లను ఎదర్కోవాల్సి ఉంటుందన్నారు. వారికి ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల ఇళ్ల స్థలాల విషయమై ప్రభుత్వానికి ఇప్పటికే నివేదికలు అందించినట్లు తెలిపారు.భారతదేశంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం 70 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే- ఐజేయూ అన్నారు. జర్నలిస్టులను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాట కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం ఇచ్చే పిలుపులో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, అన్ని రకాల కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని అందుకు రాష్ట్ర సంఘం నుండి అన్నివేళలా అండదండలు ఉంటాయని చెప్పారు.జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమల నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, దోటి శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి కేసాని శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎం.యాదగిరి, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వి.చంద్రశేఖర్ రెడ్డి, వి.వెంకట్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు ఎరుకల వంశీ, రాపోలు ప్రభాకర్, సంగేపు మల్లికార్జున్, నల్ల స్వామి, ఆడెపు శంకర్, సంగేపు మల్లేశ్, రవీంద్ర చారి, ఆకుల రఘుమయ్య, ముత్యాలు, ముడుపు శ్యామ్ రెడ్డి, మహేశ్వరం సతీశ్, వెంకన్న, నక్క శ్రీనివాస్, ఇడం గణేశ్, జక్కల నాగరాజు, దోటి లింగస్వామి పాల్గొన్నారు.

# హమాలీల సంక్షేమం కోసం సొసైటీ కృషి





2

# పేద ఆర్యవైశ్యులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాటికొండ లక్ష్మణ్ గుప్తా



**గరిడేపల్లి నవభూమి:** పేద ఆర్యవైశ్యులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఆర్యవైశ్య సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు తాటికొండ లక్ష్మణ్ గుప్తా కోరారు. మండల కేంద్రమైన గరిడేపల్లి లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో కొన్ని యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అగ్రకులాల్లోని పేదలకు కూడా రాజీవ్ యువ వికాసం పథకం వర్తింపజేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన పేద ఆర్యవైశ్యులకు ఈ పథకం ద్వారా 5 లక్షల రూపాయల వరకు సబ్సిడీతో బ్యాంకులో రుణాలు పొందవచ్చు అన్నారు. ఈ పథకానికి మార్చి 17 చివరి తేదీ కావడంతో పేద ఆర్యవైశ్యులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలోని ఆర్థికంగా వెనుకబడ్డ ఆర్యవైశ్యులు ఈ పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఆర్యవైశ్య అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ, ఈడబ్ల్యూఎస్ కోటాలో ప్రత్యేక నిధుల కేటాయింపుకు కృషి చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎంపి ధర్మబిక్షం వర్ధంతి




**మిర్యాలగూడ నవభూమి, మార్చి 26:-** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మ బిక్షం 14వ వర్ధంతి సభను నిజామాబాదులో ఘనంగా నిర్వహించారు బొమ్మగాని ధర్మ భిక్షం భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అనేక పోరాటాలు నిర్వహించారని నాయకులన్నారు. దున్నేవానికి భూమి గీసేవానికే తాటి చెట్టు కావాలని నినాదంతో గీత కార్మికు లను ప్రజలను చైతన్యం చేసి అనేక ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు. ప్రజలకు ఎమ్మెల్యేగా ఎంపీగా అనేక సేవలందించిన ఘన చరిత్ర ఉన్నది. కార్యక్రమంలో మిర్యాలగూడకు చెందిన రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, అధ్యక్షులు మొయినుద్దీన్ కార్యదర్శి గురుజ రామచంద్రం, సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, ఉపాధ్యక్షులు బుర్ర శేఖర్, బండమీది వెంకన్న, ధోటీ పాండు, మందుల పాండు, మాలిగ లింగయ్య పాల్గొన్నారు

# లైన్ వర్క్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం

### ఎఇ రవీందర్ రెడ్డి

**మిర్యాలగూడ నవభూమి, మార్చి 26:-** ఈ నెల 27 గురువారం నాడు ఉదయం 7.30 నుండి 9 గంటల వరకు 33/11 కెవి సబ్ స్టేషన్ మిర్యాలగూడ నుంచి వచ్చే అశోక్ నగర్ మరియు శాంతి నగర్ ఫీడర్ క్రింద లైన్ వర్కు నడుస్తున్నది దాని కారణంగా అశోక్ నగర్ ఏరియా శాంతినగర్ ఏరియాలో సప్లై నిలిపివేయబడుతుందని టూ టౌన్ ఎఇ ఎ. రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## తెలంగాణలోని డిగ్రీ, పిజి కళాశాల యాజమాన్యాలకు

# ఫీజు రీఇంబర్స్మెంట్ విడుదల చేయాలి

◆ సబ్ కలెక్టరేట్ లో వినతిపత్రం ఇచ్చిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం



**మిర్యాలగూడ నవభూమి, మార్చి 26:-** ఫీజు రీ ఇంబర్స్ మెంట్ జూనియర్, డిగ్రీ కళశాలలకు వెంటనే విడుదల చేయాలని స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయ పాలన అధికారి శ్రీనివాస్ శర్మ కు బుధవారం సమర్పించిన వినతిపత్రంలో మహాత్మ గాంధీ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం నేతలు కోరారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించు ఫీజుల ద్వారా మాత్రమే నడుపబడుతున్న డిగ్రీ కళాశాలలకు గత 4 సంవత్సరాల ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ చెల్లించకపోవడం వలన, చాలా మంది పేద విద్యార్థులు యాజమాన్యాలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి పట్టుభద్రులైన నిరుద్యోగ యువత స్థాపించుకున్న డిగ్రీ కళాశాలలో విద్యార్థుల దగ్గర నుండి ఎటువంటి ఫీజులు వసూలు చేయవద్దని, విద్యార్థుల ఫీజు, ఆర్టీఎఫ్ ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడం జరిగింది. దానిని అనుసరించి విద్యార్థులకు ఉత్తమ బోధన గావిస్తూ అప్పులు చేసి, ఆస్తులను అమ్మి తాము బ్రతుకుతూ తమతో పాటుగా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యాలు విద్యార్థులకు విద్యాబోధన గావిస్తూ విద్యా సంవత్సరం పూర్తయినప్పటికి ప్రభుత్వం ఆర్టీఎఫ్ ఎంటీఎఫ్ లు చెల్లించకపోవడం వలన అనేక మంది విద్యార్థులు, యాజమాన్యాలు ఇబ్బందులకు గురివుతన్నారన్నారు. విద్యార్థులకు ఎంటీఎఫ్ రాకపోవడం వలన, అధికంగా ఉన్న పరీక్ష ఫీజులను చెల్లించలేక విద్యను మధ్యలోనే వదిలి వేస్తున్నారన్నారు. భవన యజమానుల అద్దె వేధింపులు, ఉద్యోగుల జీతాల కొరకై ఒత్తిడి వారి సహాయ నిరాకరణ ఇవే కాకుండ రోజువారి ఖర్చులకు కూడా ఎంతో కష్టపడాల్సిన పరిస్థితులను కళాశాల యాజమాన్యాల వంతయిందన్నారు. యాజమాన్యాలు ఆర్థిక భారంతో, అప్పుల బాధతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలు . వెంటనే విడుదల చేయించి కళాశాలల మనుగడ కొనసాగేలా ప్రయత్నం చేయగలరని కోరారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల ఉపాధ్యక్షుడు మెండు వెంకటరెడ్డి, తెడ్ల ధనుంజయ, కోలా శ్రీనివాస్, దామర శ్రీనాథ్, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# హమాలీల సంక్షేమం కోసం సొసైటీ కృషి

◆ హమాలీ వర్కర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బిక్షా



**మిర్యాలగూడ నవభూమి మార్చి 26:-** హమాలి వర్కర్ల సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమానికి హమాలి వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీ కృషి చేస్తుందని ఎస్సీఐ హమాలీ వర్కర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ (సీఐటీయూ) అధ్యక్షులు ధనావత్ బిక్షా నాయక్ అన్నారు. బుధవారం స్థానికంగా ఆ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ సి ఐ లో కలీమ్, రవీందర్ కాంట్రాక్టు కింద సబ్ కాంట్రాక్టుగా మూడు నెలల పాటు ఎఫ్సీఐలో హమాలీ పని చేసుకునేందుకు కాంట్రాక్టు పని దొరికిందని దాని ప్రకారమే సొసైటీలో ఉన్న 14 మంది టోలీల ఆధ్వర్యంలో 210 మంది హమాలీలకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. హమాలీల వేతనాలు ఏరోజుకారోజు చెల్లిస్తున్నామని తెలిపారు. సొసైటీ నిబంధన ప్రకారం ప్రతి హమాలీ కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు వారికి సక్రమంగా వేతనాలు అందిస్తున్నామని దీని విషయంలో కొందరు సొసైటీకి సంబంధం లేని వ్యక్తులు సొసైటీని అవమానించేందుకు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టు విషయంలో జీఎంకు కోటి 20 లక్షలు ఇచ్చినట్లు చేస్తున్న ఆరోపణలు సరైనది కాదన్నారు. దీని విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కావాలని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని హమాలీలు నమ్మవద్దని సూచించారు. వ్యాగిన్, సిట్టింగ్ లోడింగ్, అన్లోడింగ్ చేసిన సమయంలో సక్రమంగా వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. డిపిఎస్ కార్మికుల విషయంలో అవినీతి జరిగిందనే మాట అవాస్తవమన్నారు. నిరాదరణమైన ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డిపిఎస్ లో రిటైర్డ్ అయిన కార్మికుని అనుభవాన్ని తమ సొసైటీకి ఉపయోగపడుతుందని ఉద్దేశంతో అతని సూచన సలహాల ప్రకారం హమాలీల సంక్షేమం కోసం ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. ఏమైనా ఉంటే ఆధారాలతో నిరూపించాలని కోరారు. సొసైటీలోని టోలీలు ఐక్యంగా ఉన్నారని వారి మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు చిల్లర ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. సొసైటీ విషయంలో బయట వ్యక్తులు ఎవరైనా జోక్యం చేసుకుంటే ఊరుకునేలేదని హెచ్చరించారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు యమ్.రవి, టోలీలు లాలూనాయక్, విజయ్నాయక్, బిల్లు నాయక్, చందర్నాయక్, చత్రునాయక్, మౌలా, చిన్నా, రామారావు, బాలోజి, చిన బాల, హెచ్.శంకర్ పాల్గొన్నారు.

# లక్ష లోపు రుణాలు మాఫీ ప్రకటించిన కాంగ్రెస్



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి మార్చి 26** పురపాలక కేంద్రంలో బుధవారం చేనేత కార్మిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షులు మాట్లాడుతూ చేనేత కార్మికుల రుణమాఫీ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో లక్షరూపు రుణమాఫీ ఉన్న అర్హులందరికీ రుణమాఫీ చేస్తానికి చెప్పి నేడు 2 లక్షల రుణమాఫీ ఉన్న ప్రతి ఒక్క సభ్యుడికి లక్ష రుణమాఫీ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరొకసారి ఉత్తర్వులు జారీ చేయడం గొప్ప విషయం అని ఆయన తెలిపారు. గడచిన చరిత్రలో ఏ ప్రభుత్వం చేయలేని నిర్ణయాలను తీసుకుంటూ కార్మికుల కర్షకుల పక్షాన నిలబడుతున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆయన ఇందుకోసం సహకరించిన సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేనేత రాష్ట్ర నాయకులు తడక వెంకటేశ్వర్లు, తడక రమేష్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భారత భూషణ్, ప్రధాన కార్యదర్శి బొమ్మ హరి శంకర్, సహాయ కార్యదర్శి బిట్ల గణేష్, కోశాధికారి రుద్ర చంద్రప్రకాష్, సభ్యులు పొట్ట బత్తిని వేణు,సభ్యులు రుద్ర చంద్రప్రకాష్ బిట్ల గణేష్, కటికం శ్యాంసుందర్, కటికం శ్యాంసుందర్, కూరపాటి భాస్కర్, గుండేటి శివరాజ్, గుండు రాజేశ్వరి, గుర్రం హేమలత, తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్



**కోదాడ మార్చి 26(నవభూమి ప్రతినిధి)** ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆటోలను నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామనీ ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్రాఫిక్ ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఆటోలు, మినీ టాటా ఏసీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. హైవేలో వెళ్లేటప్పుడు యూటర్న్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆటోలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు..ప్రజలకు ఇబ్బంది కలిగించే అకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లంతా డ్రైవింగ్ లైసెన్స్ ఆర్సీ ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఖయ్యూం, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి ధర్మ బిక్షం

### గునిగంటి మల్లేష్ గౌడ్

### ధర్మ బిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ నేతలు

**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి మార్చి 26** అనగారిన వర్గాల అభివృద్ధి అన్నది కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి ధర్మ బిక్షం అని కల్లుగీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గునిగంటి మల్లేష్ గౌడ్ అన్నారు.పురపాలక కేంద్రంలో బుధవారం పట్టణ కల్లుగీత పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ధర్మబిక్షం14వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండలో సాయుధ పోరాటంతో పాటు ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజాసేవే తన జీవిత లక్ష్యంగా పనిచేసిన గొప్ప వ్యక్తి ధర్మాభిక్షమని ఆయన కొనియాడారు. ఆయన కలలుగొన్న ఆశయసాధనలో మనందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మక్తాల పోచయ్య గౌడ్, తండా వెంకటేష్ గౌడ్ , సారా బాలయ్యగౌడ్, యాదయ్య గౌడ్, చెరుకు అంజయ్య గౌడ్, బండి యాదగిరి గౌడ్, కొయ్యడ నరసింహ గౌడ్, కట్కూరి పాండు రంగం గౌడ్, ముప్పడి శ్రీనివాస్ గౌడ్, కొండ యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర

# ఆర్థికరంగం కుదేలు





**చివ్వెంల, (నవభూమి)** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక రంగం కుదేలైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కాలం తెచ్చిన కరువు కాదు ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువేనని ఆయన అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మొగ్గయ్యగూడెంలో ఎండిన పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తీస్తూ రాక్షసానందం పొందుతున్నదన్నారు. దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం.. ఈమూడే కాంగ్రెస్ సిద్ధాంతాలని అన్నారు. పదేండ్లు ప్రశాంతంగా ఉన్న రైతాంగాన్ని మళ్లీ కన్నీళ్ల పాలుచేసిన పాపం కాంగ్రెస్ దేనన్నారు. పొట్టకొచ్చిన పంటలను నీళ్లులేక పశువులకు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని, కనీసం ఒక్క తడి ఇస్తే సగం పంటైనా దక్కేదన్నారు. ఏడాదిన్నర కాకముందే అన్నిరంగాల్లో ఇంత నిర్లక్ష్యమా అని ఆవేదన వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రారంభించిన తర్వాత ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదు, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రెండుసార్లు యాసంగి పంటలు ఎండిపోయినట్లు చెప్పారు. కాళేశ్వరం కాకుండా ఎస్సారెస్పీ నీళ్లే అయితే ఇప్పుడు పంటలు ఎందుకు ఎండుతున్నాయో మంత్రులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మళ్లీ కాళేశ్వరం తమకు అప్పగిస్తే ఒక్క ఎకరం ఎండిపోకుండా చూస్తామన్నారు. ఎండిపోయిన పంట పొలాల గురించి, రైతన్నల కష్టాల గురించి ఏ ఒక్క మంత్రి కూడా మాట్లాడకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. దావతుకు పోవడానికి హెలికాప్టర్లు దొరుకుతున్నాయి కానీ ఎండిన పొలాలు పరిశీలించడానికి సమయం దొరకట్లేదా అని ప్రశ్నించారు. ఎండిన పొలాలను, రైతన్నల కష్టాలను ఎక్కిరించడానికి రేవంత్ జిల్లాకు వస్తున్నట్టుందన్నారు. రేవంత్, కాంగ్రెస్ చేసిన మోసానికి రైతన్నలు కన్నీళ్లు పెడుతున్నారని, వేలాది మంది రైతులు ఇబ్బందులు పడుతుంటే కనీసం ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు.కరోనా లాంటి కష్ట కాలంలో కూడా రైతాంగానికి చిన్న ఇబ్బంది కలగకుండా కేసీఆర్ నాయకత్వంలో అండగా నిలిచి ఆదుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే తాము రూ.15 వేలు ఇస్తామని ఆశపెట్టి మోసం చేసిండన్నారు. మంత్రులకు శాఖల గురించి అర్థం కాకపోతే కనీసం అధికారులను అడిగి తెలుసుకుంటే మంచిదన్నారు. కేసీఆర్ ముందుచూపుతో అద్భుత ప్రణాళికతో రాష్ట్రాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దిండన్నారు. మళ్లీ తెలంగాణలో ఆంధ్ర బానిసలుగా పాలన కొనసాగిస్తున్న దుస్థితి నెలకొందన్నారు. కనీసం ఒక్క తడికైనా నీళ్లిస్తే కొంత మంది రైతులన్నా అప్పుల బారిన పడకుండా ఉండేవారన్నారు. స్థానిక మంత్రి ఉత్తమ్ స్పందించి ఇంకోక్క తడికన్నా నీళ్లివ్వాలన్నారు. ఈ సందర్భంగా పంట నష్ట పోయిన రైతులు ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ జగదీశ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జులకంటి జీవన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, జిల్లా నాయకులు గుర్రం సత్యనారాయణ రెడ్డి, ధరావత్ బాబునాయక్, భూక్యా నాగునాయక్ పాల్గొన్నారు.

## పీడిత ప్రజల గొంతుక

# ధర్మభిక్షం : పోలగోని సత్యం

**మునుగోడ, (నవభూమి)** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మబిక్షం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని మండల గౌడ సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన బస్టాండ్ వద్ద ఉన్న ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లుగా ఎంపీగా పనిచేసిన ధర్మభిక్షం చట్టసభలో పీడిత ప్రజల గొంతుకై వినిపించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జాజుల అంజయ్య గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, వివిధ పార్టీల నాయకులు పాలకూరి యాదయ్య గౌడ్, నకరేకంటి యాదయ్య గౌడ్, మాదగోని రాజేశ్ గౌడ్, పొలగోని సైదులు, దేశిడి యాదయ్య గౌడ్, మారగోని అంజయ్య, జాజుల స్వామి గౌడ్, పంతంగి స్వామి, గజ్జెల బాలరాజు, బి.లాలు,దుబ్బ వెంకన్న, బండారు శంకర్, గోపగోని పాపయ్య, కట్కూరు లింగస్వామి, అంజి పాల్గొన్నారు.



# ఆస్తిపన్నుపై 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

### మునిసిపల్ కమిషనర్ యూసుఫ్



**మిర్యాలగూడ నవభూమి, మార్చి 26:-** రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్నుపై 90 వడ్డీ రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ మునిసిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ కోరారు. బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దాన కిషోర్ ఈ మేరకు జిఓఆర్టీ నెంబర్ 154 ఈ నెల 25న జారీ చేశారని తెలిపారు. పేరుకుపోయిన ఆస్తిపన్ను 2024-25సంవత్సరం వరకు బకాయిలపై వడ్డీ 90 శాతం కల్పించేందుకు ఒన్ టైం సెటిల్మెంట్ కింద 90 శాతం వడ్డీపై రాయితీ రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఈ సౌకర్యం కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. భవిష్యత్తు చెల్లింపులో కూడ రాయితీ సర్దుబాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారని తెలిపారు. ప్రతి ఒక్క ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట రెవిన్యూ ఆఫీసర్ జి. జ్ఞానీశ్వరి ఉన్నారు.

# బాపూజీ గ్రంధాలయం ఎదుట బీఈడీ అభ్యర్థుల ఆందోళన



**కోదాడ మార్చి 26 (నవభూమి ప్రతినిధి)** ఉపాధ్యాయ ఖాళీల భర్తీలో స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని బిఈడి అభ్యర్థుల నియోజకవర్గ అధ్యక్షుడు శివాజీ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ పట్టణ పరిధిలోని బాపూజి శాఖ గ్రంధాలయం ఎదుట బుధవారం పదోన్నతుల ప్రక్రియకు వ్యతిరేకంగా అభ్యర్థులు నిరసనకు దిగారు. సీనియర్ ఎస్జీటీ టీచర్లకు 70శాతం మేరా పదోన్నతులు కల్పించడంతో బీఈడి అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. టీచర్ పోస్టుల ఖాళీలాల్లో 30 శాతం మాత్రమే నేరుగా భర్తీ చేస్తూ, 70 శాతం ఖాళీలు పదోన్నతులు కల్పిస్తుండం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ రాష్ట్రంతో సహా ఇతర రాష్ట్రాల మాదిరిగా 70 శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను బీఈడీ అభ్యర్థులతోనే నింపుతున్నట్లుగా మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. పదోన్నతుల అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బీఈడీ అభ్యర్థులు రాంబాబు, శ్రీను, సందీప్, నరేష్, శోభ, సారిక, సుమ, తులసి, రమేష్ శ్రీరాములు, శ్రీకాంత్, రామారావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాదారులు బైండోవర్

**మిర్యాలగూడ నవభూమి, మార్చి 26:-** వేములపల్లి మండలం రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల నాగరాజు టీఎస్ 04 యు 5038 నెం%ఎ%బర్ గల ట్రాక్టర్లో మూసి నుండి తుపాకుల వెంకటేష్ అనే డ్రైవర్ ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా తడకమళ్ళ గ్రామ శివారులో మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తన సిబ్బందితో పాటు ఉదయం 6గంటలకు అట్టి ఇసుక ట్రాక్టర్ ను పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి నిందితులను బైండోవర్ చేసి మిర్యాలగూడ తహసీల్దార్ ఎన్.హరిబాబు ముందు హాజరు పరచారు.

# ప్రమాదాల నివారణ కోసమే బ్లింకింగ్ లైట్ల ఏర్పాటు

### బ్లింకింగ్ ప్రారంభిస్తున్న ఏసీపీ మధుసూదన్ రెడ్డి





**భూదాన్‌పోచంపల్లి నవభూమి** మండలంలోని జలాల్పురం గ్రామంలోని చెరువు నలుపు లో శుభం ఫెర్టిలిటీ సౌజన్యంతో బ్లింకింగ్ లైట్లు , బార్కెట్ల ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అయినా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రమాదాల కారణంగా దాతలు లింకింగ్ లైట్ల ఏర్పాటు కోసం రావడం శుభ పరిమామని ఆయన అన్నారు. ఇదే కాక గ్రామ సమీపంలో స్కూల్ జాన్ నేపథ్యంలో బార్కెట్లను అందించడం ఆశించడమని ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన కొన్ని రోజుల్లోనే మూలవైపులో పూర్తిస్థాయి చెట్లను తొలగించడానికి కృషి చేసిన గోరంటి ప్రదీప్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్ట్యా ఆరో బయట నిద్రపోయేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. కాదా నిత్యం పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తమై ఉండి తమ విలువైన సమాచారాన్ని కోల్పోవద్దని ఆయన సూచించారు. ఇంకే కాక బెట్టింగ్ యాప్ లలో యువత ఆకర్షించులై పూర్తిస్థాయిలో నష్టపోయి తమ జీవితాలను కోల్పోతున్నారని ఏ విషయంలో తల్లిదండ్రులు పిల్లల ఒక కన్ను వేసి ఉంచి వారిని జాగ్రత్తలు చేశాల్సిన బాధ్యత ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్, సి రాములు, ఎస్సై చర్ల భాస్కర్ రెడ్డి, ట్రైనింగ్ ఎస్సై వంశీ, ఏఎస్ఐ సైదిరెడ్డి, జమిదారు శ్రీనివాస్, నాయకులు గోరంటి ప్రదీప్ రెడ్డి, బైరు బాలరాజు, సురేందర్ రెడ్డి, పాలకొర్ల ఆగయ్య, బైరు వెంకటేష్, రాము, నవీన్, తదితరులు పాల్గొన్నారు

# మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు

### మండల వ్యవసాయ అధికారి భానోత్ అనిల్ కుమార్

**పెన్‌పహాడ్, మర్చి 26(నవభూమి)** మహిళా రైతుల నుండి సబ్సిడీ పై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు కొరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బానోత్ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.2024-25 సంవత్సరానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా పెన్ పహాడ్ మండలానికి 1. చేతితో లేదా బ్యాటరీ తో మందు కొట్టే పంపులు = 8( జనరల్=7, ఎస్సీ =1) 2. పవర్ / తైవాన్ స్ప్రేయర్లు = 8 (జనరల్=6, ఎస్సీ =1, ఎస్టి =1) 3. రొటొవెటర్లు =3 (జనరల్=2, ఎస్టి =1) 4. సీడ్, ఫెర్టిలైజర్ డ్రిల్ = 1 (%+వఅ) 5. ట్రాక్టర్ తో దున్నే పనిముట్లు ( కల్టివేటర్, డిస్క్ హ్యారో, నాగలి, దమ్ము చక్రాలు మొదలైనవి) =4 (జనరల్=3, ఎస్సీ =1) ఉన్నాయి. కావున ఆసక్తిగల మహిళా రైతులు మాత్రమే వ్యవసాయ యాంత్రికరణ పథకంలో 50 శాతం సబ్సిడీ తో పనిముట్లు పొందడానికి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసిందిగా వారు తెలిపారు.దరఖాస్తు చేసుకోవడానికి కావలసినవి 1. మహిళా రైతు కొత్త పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ 2. మహిళా రైతు ఆధార్ కార్డు జిరాక్స్ 3. ఒకవేళ ట్రాక్టర్ పనిముట్లు అయితే మహిళ పేరుతో ఉన్న ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జిరాక్స్ 4. ఆ మహిళ యొక్క రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు 5. దరఖాస్తు ఫారం 6. రైతు చెల్లించ వలసిన వాటా కి సంబంధించిన డిడి ఎవరు ముందుగా వస్తె వారికే ఇవ్వడం జరుగుతుంది కావున పైన తెలిపిన జిరాక్సు తీసుకొని మండల వ్యవసాయ అధికారి కార్యాలయం పెన్ పహాడ్ దరఖాస్తు సమర్పించవలసిందిగా కోరారు.

# ఉపాధి హామీ పనులపై నేడు సోషల్ ఆడిట్

**పెన్‌పహాడ్, ప్రతినిధి మర్చి 26(నవభూమి)** పెన్ పహాడ్ మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో 29 గ్రామాల్లో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జై వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంపై గ్రామసభలో వచ్చిన అభ్యంతరాలను ఓపెన్ ఫోరంలో చదివి వినిపిస్తారని. గ్రామాల్లో రికార్డులు, క్షేత్ర స్థాయిలో పనులను గ్రామసభలు నిర్వహించి ఓపెన్ ఫోరం మీటింగ్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు

# ఏప్రిల్ 10న బార్ అసోసియేషన్ ఎన్నికలు

**మిర్యాలగూడ నవభూమి మార్చి 26:-** మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారులైన న్యాయవాదులు ఎ.సుధాకర్ రావు ఏచురి శ్రీనివాస్ లు బుధవారం నోటిఫికేషన్ లో తెలిపారు. బార్ లో సుమారు 144మంది న్యాయవాదులు సభ్యత్వం కలిగి ఉన్నారు. 27న ఓటర్స్ జాబితా ప్రకటిస్తారని, 27, 28నఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4 గంటలకు నామినేషన్లు స్వీకరణ, ఏప్రిల్ ఒకటిన నామినేషన్ల పరిశీలన, 2న నామినేషన్ల ఉపసంహరణ, 3న అభ్యర్థుల జాబితా ప్రకటన, 10న ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2గంటల బార్ అసోసియేషన్ లో వరకు పోలింగ్, వెంటనే మధ్యాహ్నం 3గంటల నుండి ఓట్ల లెక్కింపు. వెంటనే ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

# జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



**మిర్యాలగూడ నవభూమి మార్చి 26:-**జమాతే ఇస్లామీ హింద్ మిర్యాలగూడ అధ్యక్షుడు ముహమ్మద్ యూసుఫ్ జీలాని ఆధ్వర్యంలో హిందూ, క్రిష్టియన్ సోదరులకు ఇఫ్తార్ విందును ముస్లిం షాదిఖానాలో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో జీలాని మాట్లాడుతూ ఈ విధంగా హిందూ, క్రిష్టియన్ సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం శుభపరిణామమని, హిందూ, క్రిష్టియన్ ముస్లింల ఐక్యతకు దోహాదం చేసే కార్యక్రమం చేపట్టడం సంతోషకర విషయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త షేక్ ఖాజా మాట్లాడుతూ మానవులంతా ఒకే జంట ఆదమ్ హవ్వల సంతానమని అందరూ పరస్పరం సోదరులేనని, దైవం రంజాన్ ఉపవాసాలు కేవలం ముస్లింలకే విధించలేదు హిందూ మరియు క్రిష్టియన్ సమాజాలలో కూడా ఉన్నాయన్నారు. దైవం మనిషిని సృష్టించిన తరువాత మానవ మార్గ దర్శకత్వం కోసం దివ్య గ్రంధాలను, ప్రవక్తలను వివిధ కాలాలలో, వివిధ ప్రాంతాలలో ఒక లక్ష ఇరవై నాలుగు వేల మందిని పంపడం జరిగిందని ఆ క్రమంలో చిట్ట చివరి అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) గారిని పంపడం జరిగిందని అన్నారు. కనుక మనమంతా వారిని ఆదర్శంగా తీసు కోవాలని తెలిపారు. మంచి పనులు చేస్తూ సమజానికి ఉపయోగ పడాలని కోరారు. కార్యక్రమంలో మౌజమ్ హుస్సేన్, జానిమియా, కలీం, సలీం అఖ్తర్ ఉదయ్ గారులు పాల్గొన్నారు

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి : గిద్దె రాజేశ్

**మునుగోడు, (నవభూమి)** రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా, వారిని చిన్నచూపు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరు దురదృష్టకరమని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం పరిధిలోని కొరటికల్ గ్రామంలో బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమంపై వివక్ష చూపిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ సంఘం నేతలతో కలిసి కొబ్బరి పీసు తింటూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మంది దివ్యాంగులు అనేక సమస్యలతో అల్లాడిపోతూ దుర్భర జీవితాలు గడుపుతుంటే రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయకుండా, ప్రజా పాలన పేరుతో సంబరాలు చేసుకుంటూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న తీరు దురదృష్టకరమన్నారు.